


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**జపాను ప్రభుత్వం** తరుపున యమమోటో కొత్త ప్రభుత్వానికి వందనం సమర్పించాడు.

తరువాత తన ప్రసంగంతో సభను ప్రారంభించాడు సుభాస్ చంద్ర బోస్. ఆ ప్రసంగం ఏదో ఒక ఆపద్ధర్మ ప్రభుత్వ అధినేత చేస్తున్న ప్రసంగంలా సాగలేదు. బోసు తనను తాను ఎక్కడా తక్కువ చేసుకోలేదు. “ఈ రోజు ఇక్కడ ఏర్పడుతున్న ప్రభుత్వం మీద కొంత మందికి నమ్మకం లేక పోవచ్చు. కానీ భారతీయ యువత ఈ ప్రభుత్వానికి పూర్తి మద్దతు పలుకుతోంది. ఆజాద్ హింద్ ఫౌజు ఈ అర్ధరాత్రి నుండి బ్రిటిషు సామ్రాజ్యం మీద యుద్ధం ప్రకటిస్తోంది. ఒకసారి బర్మా సరిహద్దులు దాటి ఇంఫాల్, కోహిమా చేరుకుని భారతీయ గడ్డ మీద ఈ త్రివర్ణ పతాకం ఎగురవేసిన రోజు... ఆసేతు హిమాచలం యువత వీధుల్లోకి వస్తారు. బ్రిటిషు వారిని తరిమి తరిమి కొడతారు. ఆరోజు ఎంతో దూరంలో లేదని నేను నమ్ముతున్నాను. అలానే నన్ను సంపూర్ణంగా విశ్వసించిన జపాను ప్రభుత్వానికి కృతజ్ఞతతో పది యుద్ధ విమానాల ఖరీదును బహుమానంగా ఇస్తున్నాను...” అని ప్రకటించిన బోసు ఆత్మ విశ్వాసాని చూసి యమమోటో ఆశ్చర్య పోయాడు. తమ సహాయం లేకుండా ఒక గంట కూడా నిలవ లేని ప్రభుత్వం ఇది. అలాంటిది తమకే బహుమతి ప్రకటిస్తున్నాడు బోసు. ‘ఏమిటి ఇతని తెగువ?’ అని సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడతను.

బోసు తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ, “... శత్రువుకయినా ఆపత్కాలంలో సహాయం చేసే జాతి మాది. బెంగాలు కరువులో లక్షలాది మంది సరయిన ఆహారం లేక మరణిస్తున్నారు. మూడు లక్షల టన్నుల ఆహార ధాన్యాలు భారత దేశం పంపటానికి నేను సిద్ధంగా ఉన్నాను. కానీ బ్రిటిషు ప్రభుత్వం అహంకారంతో నా ఓడలను దేశంలోకి అనుమతించకుండా ప్రజల ప్రాణాలను పణంగా పెట్టింది. బ్రిటిషు ప్రభుత్వానికి భారతదేశాన్ని దోచుకోవటంలో ఉన్న శ్రద్ధ ప్రజల ఆకలి

బాధలు తీర్చటంలో లేదు. బ్రిటిషు అహంకారానికి ఇదే నిదర్శనం..." అంటూ అతను చేసిన ప్రసంగం సభికులను ఉర్రూతలూగించింది.

తరువాత ముందుగా బోసు ప్రతిజ్ఞ చేశాడు. "దేవుని మీద ప్రమాణం చేసి... సుభాస్ చంద్ర బోస్ అనే నేను 38 కోట్ల భారతీయులు దాశ్య శృంఖలాల నుండి విముక్తి పొందే వరకు, నా ఊపిరి నిలిచి ఉన్నంత వరకు, పోరాటం ఆపనని ప్రతిజ్ఞ చేస్తున్నాను. సదా భారదేశానికి దాసుడనయి ఉంటానని, 38 కోట్ల భారతీయుల ఆకాంక్షలు నెరవేర్చటమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తాననీ ప్రతిజ్ఞ చేస్తున్నాను. దేశ స్వాతంత్రం కోసం, స్వాతంత్రం సాధించిన తరువాత దానిని నిలబెట్టుకోవటం కోసం నా తుది రక్తపు బొట్టును చిందించటానికయినా సన్నద్ధంగా ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను." అని బోసు చేసిన ప్రతిజ్ఞ అప్పటికే భావోద్వేగాలకు లోనయిన సభికుల కళ్లలో నీళ్ళు తెప్పించింది.

తరువాత వరుసగా అతని మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

ఎస్.ఎ.అయ్యర్ ప్రచార శాఖా మంత్రిగా, ఏ.సి.ఛటర్జీ ఆర్థిక శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా... అజీజ్ అహమద్, ఎన్.ఎస్.భగత్, జె.కె.భోంస్లే, గుల్జారా సింగ్, ఎమ్.జె.కియాని, ఎ.డి.లోకనాథన్, ఈషాన్ కాదిర్, షానవాజ్ ఖాన్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

భారత ప్రభుత్వ ప్రకటన వెలువడిన వారాల వ్యవధిలో 9 దేశాలు ఈ ప్రభుత్వాన్ని గుర్తిస్తూ రాయబార సంబంధాలు నెలకొల్పుకున్నాయి.

జపాన్, బర్మా, క్రొయేషియా, జర్మనీ, ఫిలప్పీన్, నాన్‌కింగ్ (తైపే), మంచుకూ (మంచూరియా), ఇటలీ, సియామ్ (థాయిలాండ్) దేశాలు బోసు ప్రభుత్వానికి మద్దతు తెలపటం బోసు సాధించిన గొప్ప విజయం.

సాధించిన దాని కంటే సాధించవలసినది ఎంతో పెద్దదని బోసుకు తెలుసు. ఆజాద్ హింద్ ఫౌజు సింగపూరులో కూర్చోవటం వలన ఉపయోగం లేదు. తాను భారతదేశ ప్రజలకు వాగ్దానం చేసినట్లు సైన్యాన్ని ముందుగా భారతదేశంలోకి నడిపించాలి. అలా జరిగిన మరుక్షణం అడుగు అడుగుకు వేలాది యువతీ యువకులు తమతో చేరతారు. అప్పుడు తమను ఆపే శక్తి బ్రిటిషు ప్రభుత్వానికి కాదు కదా, ప్రపంచంలో ఏ శక్తికీ ఉండదని బోసు విశ్వసించాడు. వెంటనే ఆ ప్రణాళిక అమలు చేయటానికి కావలసిన ఏర్పాట్లు చూడటంలో నిమగ్నమయ్యాడు.

సైన్యాన్ని భారతదేశానికి పంపే ముందే గూఢచారులు వెళ్లాలి. ప్రతి నగరంలోనూ విప్లవానికి కలిసి వచ్చే శక్తులను కలిసి ఆజాద్ హింద్ ఫౌజుకు మద్దతు సమీకరించాలి. అందుకుగానూ పారాచూట్ల ద్వారా గూఢచారులను బర్మా సరిహద్దుల్లోని మణిపూర్, నాగాలాండ్‌లకు పంపటం తేలిక. అక్కడ నుండి వారు ఎవరికీ కనపడ కుండా దేశం నలుమూలలకు విస్తరిస్తారు. ఆ విధంగా మొదటి విడత గూఢచారులుగా 130 మందిని సెలెక్ట్ చేసిన బోసు వారిని భారతదేశం పంపటానికి ఏర్పాట్లు చేశాడు.

గూఢచారులు వెళ్తున్న ప్రదేశాలలో విప్లవానికి మద్దతు ఇచ్చే వారి పేర్లను వారికి ఇచ్చారు. వీలయినంత త్వరగా మద్దతుదారులను సంప్రదించి ధన రూపంలో కానీ, ఇంకే రూపంలో కానీ మద్దతు అడగమని చెప్పారు. వెళ్తున్న 130 మంది పేర్లు అత్యంత రహస్యంగా ఉంచారు. ఆఖరికి ఆ గూఢచారులకు కూడా మిగతా వారి పేర్లు కానీ, ఎవరు ఎక్కడికి వెళ్తున్నారు లాంటి వివరాలు తెలియనివ్వ లేదు. దానివలన బ్రిటిషు పోలీసులకు ఒకరు పట్టుబడ్డా, వారి ఇంటరాగేషన్‌కు గురయినా వేరే వారి వివరాలు ఇవ్వలేరు. వారికి రేడియో సెట్లు ఇవ్వటం ద్వారా అక్కడ ఏం జరుగుతుందో ఆ సమాచారం ఇక్కడకు చేరవేయాలని చెప్పారు.

కొన్ని రోజుల్లోనే అనుకున్న విధంగా 130 మంది గూఢచారులను ఆజాద్ హింద్ ఫౌజ్ భారతదేశంలోకి పంపింది.

ప్రస్తుతం...

కాంచనమాల, మయాంక్ ఒక రెస్టారెంటులో కూర్చుని కాఫీ తాగుతున్నారు.

ఉదయాన్నే మయాంక్, “ఈ రోజు ఎటు వెళ్దాం మేడం?” అని అడిగాడు.

“ఈరోజు కాథే బిల్డింగ్‌లోని రెస్టారెంటుకు వెళ్దాం...” అంది కాంచనమాల.

ఆమె నుండి ఇలాంటి సమాధానం ఊహించని మయాంక్ బిత్తర పోయాడు. “మీరేదో మ్యూజియం పేరో, మరో చారిత్రిక కట్టడం పేరో చెప్తారనుకుంటే ఇలా రెస్టారెంటుకు వెళ్దామంటున్నారే...” అంటూనే క్యాబ్ బుక్ చేశాడు.

క్యాబ్‌లో బయలుదేరి ఇక్కడకు వచ్చేవరకు బయట దృశ్యాలు చూసిన ఆమె ఒకసారి రెస్టారెంటులో కూర్చున్న తరువాత, సుభాస్ చంద్ర బోస్ సింగపూర్ చేరిన తరువాత జరిగిన పరిణామాలు చెప్పటం ప్రారంభించింది.

ఇప్పుడే ఆమె చెప్పటం పూర్తయింది.

“అంటే మీరనేది ఏమిటి? ఆ రోజు బోసు గారు ప్రవాసంలో స్థాపించిన భారత ప్రభుత్వం ఈ రెస్టారెంటులో మొదలయిందా?” నమ్మలేనట్లు అడిగాడు మయాంక్.

నవ్వింది కాంచనమాల. “ఈ రెస్టారెంటులో కాదు. అప్పట్లో బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోరులో సినిమా హాలు ఉండేది. మొదటి భారతదేశ అధినేత ప్రమాణ స్వీకారం ఆ సినిమా హాలులోనే జరిగింది.”

“మైగాడ్! మీరు చెప్పాక కూడా నమ్మలేక పోతున్నాను.” అంటూ వెంటనే మొబయిల్‌లో గూగుల్ చేసి చూశాడు మయాంక్. “నిజమే మేడమ్! అదంతా ఇక్కడ కూడా ఉంది.” అన్నాడు.

“మీ జనరేషన్‌తో అదే సమస్య, ఆ రోజు జరిగిన సంఘటనలకు ప్రత్యక్ష సాక్షిని నేను ఎదురుగా కూర్చుని చెప్తుంటే, నా మాటలు కన్ఫర్మ్ చేసుకోవటానికి గూగుల్ చూస్తానంటున్నావ్...” అంది అలిగినట్లు.

"అయ్యో! మిమ్మల్ని ప్రధానమంత్రిగారే నెత్తిన పెట్టుకుని చూసుకుంటుంటే, నేను నమ్మక పోవటమా?" భయపడుతున్నట్లు నటిస్తూ అన్నాడు మయాంక్. తరువాత, "ఈ బిల్డింగ్ 2006 లో తిరిగి కట్టారంట. అప్పుడు కూడా పాత సినిమా హాలు ముందు భాగాన్ని యధాతధంగా ఉంచి మిగిలిన భవనాన్ని కట్టారంట. ఇప్పుడు ఇక్కడ సినిమా హాలు స్థానంలో మల్టీప్లెక్స్ వచ్చింది. 8 స్క్రీనులు ఉన్నాయి. మీరు 'ఊ...' అంటే ఏదో ఒక సినిమాకు టికెట్ తెమ్మంటారా?" అన్నాడు.

"అంత ఓపిక లేదులే..." అంది కాంచనమాల.

కాసేపు ఇద్దరి మధ్యా మౌనం దొర్లింది.

"అన్నట్లు ఒక డౌటు అడగాలనుకుంటూనే మరచిపోయాను. ఇందాక మీరు ఆజాద్ హింద్ ఫౌజు గురించి చెప్తూ... 130 మంది గూఢచారులు దొంగతనంగా భారతదేశంలోకి ప్రవేశించారని చెప్పారు కదా, అందులో అందరూ మొగవారే ఉన్నారా? ఆడవాళ్ళు కూడా ఉన్నారా?"

"మొదట పంపిన గూఢచారుల్లో ఆడవారు ఎవరూ లేరు. అయితే రెండవసారి ఒక అత్యంత ముఖ్యమయిన పని కోసం అయిదుగురు ఆడవారిని పంపారు."

"ఆ రోజుల్లోనే లేడీ జేమ్స్‌బాండులు కూడా ఉన్నారన్న మాట. వాళ్ల పేర్లు ఏమైనా తెలుసా మేడమ్... పుస్తకంలో రాసుకుంటాను." అన్నాడు మయాంక్ తిరిగి పుస్తకం తీస్తూ.

"ఒకరు నీ ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నారు."

కాసేపు నోరు తెరచుకుని ఆమె వైపు చూస్తూ ఉండిపోయాడు మయాంక్. "మీరు ఇలా ఎన్నిసార్లు నన్ను ఆశ్చర్యానికి గురి చేస్తారు?" అన్నాడు తెచ్చిపెట్టుకున్న కోపంతో. తరువాత, "అదీ మన మంచికేలేండి. నేనే ఇంత ఆశ్చర్య పోతే పుస్తకం చదువుతున్న పాఠకుడు మరెంత ఆశ్చర్యపోతాడో ఊహించుకోండి. ఈ పుస్తకం డామ్ ష్యూర్‌గా సక్సెస్ అవుతుంది." అన్నాడు ఆనందంగా.

ఇంతలో వెయిటర్ వాళ్లు ఆర్డర్ చేసిన మరో కాఫీ తెచ్చి టేబుల్ మీద పెట్టి వెళ్ళి పోయాడు.

"ఎన్ని కాఫీలు తాగిస్తావ్? ఇవాళ లంచ్ లేదా?"

"ఎంతమాటండీ... పదండి వెళ్దాం." అంటూ లేచాడు మయాంక్.

"ముందు తెప్పించిన కాఫీ తాగు. ఏదీ వృధా చేయకూడదు..."

తిరిగి కూర్చున్నాడు మయాంక్. ఇంతలో అతని మెదడులో ఏదో మెరుపు మెరిసింది. "మేడమ్! మొత్తం అయిదుగురు ఆడ గూఢచారులు ఉన్నారన్నారు కదా..."

"అవును."

"అందులో మీరు ఒకరు."

"అవును."

"మిగిలిన రెండు పేర్లు నేను చెప్తాను. ఒకటి మధుబాల. మన ప్రధానమంత్రిగారి అమ్మాయి. రెండవ వ్యక్తి చేవా..."

"నువు కనిపించే దానికంటే షార్ప్ మయాంక్..." అతని మాటలు నిజమేనని ఒప్పుకుంటూ అంది కాంచనమాల.

"పొగడ్తకు థాంక్స్. మిగిలిన రెండు పేర్లు, వాళ్ల వివరాలు కూడా చెప్పండి..."

కాంచనమాల మొహం మీదకు మళ్లీ చిరునవ్వు వచ్చింది. "వాళ్ల పేర్లు డోల్మా, ఫ్లోరెన్స్..."

"పేరును బట్టి ఎవరు ఏ ప్రాంతం వారో తెలుసుకోవటం కష్టం అనుకోండి. కానీ ఒకరి పేరు వింటుంటే యూరోపియన్ పేరులా ఉంది. నిజమేనా?"

"నిజమే ఫ్లోరెన్స్ ఇంగ్లాండు అమ్మాయి. డోల్మా నాగా యువతి..."

"ఇంగ్లండు అమ్మాయి ఇండియా తరుపున గూఢచర్యం చేయటం ఏమిటి?"

మళ్లీ నవ్వింది కాంచనమాల.

1943, జూన్ నెల...

కోహిమాలో ఉన్న మిలటరీ కంటోన్‌మెంటుకు అవసరమయిన సరుకులు చేరవేసిన రాయల్ ఎయిర్‌ఫోర్స్ డకోటా విమానం తిరుగు ప్రయాణం మొదలు పెట్టింది. అది ఇలా గాలిలోకి లేచిందో లేదో దట్టమయిన అడవులు మొదలయ్యాయి. నిజం చెప్పాలంటే కలకత్తాలో బయలుదేరి ఇక్కడకు వచ్చేవరకు కనిపించే జనావాసాలు తక్కువ. అంతా దుర్గమమయిన అటవీ ప్రాంతం.

కోహిమా నాగాలాండ్‌లో ఒక ముఖ్యమయిన పట్టణం. జనాభా ఇరవై వేలు ఉంటుందేమో. అసలు మొత్తం నాగాలాండ్ జనాభానే లక్ష లోపు ఉంటుంది. ఆటవిక తెగలు ఎక్కువ. అయితే రెండవ ప్రపంచ యుద్ధం మొదలు కావటంతో భారత దేశానికి వ్యూహాత్మకంగా కోహిమా ముఖ్యమయింది.

కోహిమాకు తూర్పున బర్మా ఉంటుంది. బర్మాని జపాను సైన్యం బ్రిటిషు వారి నుండి వశం చేసుకుంది. ఇక జపాను చూపు తరువాత భారతదేశం మీదే ఉంటుందనేది అందరికీ తెలిసిన విషయమే. జపాను సైన్యం భారతదేశంలో అడుగు పెట్టాలంటే కోహిమా, ఇంఫాల్ నగరాల మీదుగానే రావాలి. అందుకే ఆ రెండు నగరాలను మిలటరీతో నింపి వేశారు. సైన్యాన్ని కలకత్తా నుండి తరలిస్తున్నారు. ఆ కొండ మార్గాల్లో సైనికులను వాహనాల్లో తరలించాలంటే రోజుల సమయం పడుతుంది. అందుకే వారిని విమానాల్లో తరలిస్తున్నారు. నిజం చెప్పాలంటే కోహిమాలో విమానాశ్రయం కానీ రన్‌వే కానీ లేదు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రన్‌వే మీద విమానాలు దిగుతున్నాయి. అలానే వారికి కావలసిన

సామాగ్రి, ఆహారపదార్థాలు అందించటానికి విరామం లేకుండా విమానాలు తిరుగుతున్నాయి. అలా తిరుగుతున్న విమానాల్లో ఇది కూడా ఒకటి.

గాల్లోకి లేచిన విమానం పైలెట్‌కి కింద అడవిలో నుండి సుడులు తిరుగుతూ పైకి లేస్తున్న పొగ కనిపించింది. ఒక్క క్షణం ఆ పొగ వైపు ఆసక్తిగా చూసిన అతను తిరిగి తన దృష్టిని తన పని మీదకు మరలించాడు.

అడవిలో అప్పుడే వేటాడిన కుందేలును మంట మీద కాలుస్తోంది డోల్మా. ఆమె చేస్తున్న పనిని ఆసక్తిగా చూస్తోంది ఫ్లోరెన్స్.

డోల్మా చామనచాయతో ఉంటుంది. జుట్టు గిరజాలు తిరిగి ఉండటంతో కత్తిరించుకోక పోయినా భుజాల వరకు మాత్రమే ఉంది. మెడలో వేసుకున్న రంగురంగుల పూసల దండ ఎండలో మెరుస్తోంది. రెండు పాములు పెనవేసుకున్న బొమ్మ ముంజేతి లోపల పక్క పచ్చబొట్టుగా ఉంది. తల మీద జుట్టు ముందు భాగం కవర్ అయ్యేలా తెల్లని గుడ్డను కట్టుకుంది. ఆ అమ్మాయి నవ్వుతుండగా చూసిన వారు తక్కువ. ఎప్పుడూ సీరియస్‌గా ఉంటుంది. ఆమె కళ్లలో ఎవరినీ లెక్కచేయని తెగింపు స్పష్టంగా కనిపిస్తుంటుంది. ఆమె వేసుకున్న బట్టల మీద రంగులు వెలిసిపోయి ఉన్నాయి.

ఆమె పక్కన ఉన్న ఫ్లోరెన్స్ బ్రిటిషు యువతి. స్వచ్ఛమయిన తెల్లటి శరీర ఛాయ కారణంగా శరీరం మీద ఉన్న చిన్నచిన్న మచ్చలు కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. నీలి రంగు కనుగుడ్లు ఆమె మోహానికి అమాయకత్వాన్ని అలుముతున్నాయి. గోధుమ రంగు జుట్టును మెడ కింద వరకు ఉండేలా కత్తిరించుకుంది. నల్ల రంగు పాంటు, పూలపూల షర్టు ధరించి ఉంది. ఆమెలో చిలిపితనం పాళ్లు ఎక్కువ. ఆమె మొహంలో, నవ్వులో అమాయకత్వంతో కూడిన చిలిపిదనం కనిపిస్తుంటుంది.

రెండు మందపాటి ఆకులను దొప్పలుగా చేసి, వాటిలో కాల్చటం పూర్తి చేసిన వేడివేడి కుందేలు మాంసాన్ని తెచ్చింది డోల్మా. తన బొడ్లో దోపుకుని ఉన్న ఒక చిన్న సంచీని బయటకు తీసి దానిలో ఉన్న రాతి ఉప్పును రెండు వేళ్లతో తీసుకుని మాసం మీద చల్లింది.

నోట్లో పెట్టుకుని రుచి చూసి, "సో--- యమ్మీ!" అంది ఫ్లోరెన్స్.

నాగాలాండ్‌లో నూటికి ఎనభై మందికి ఇంగ్లీషు వస్తుంది. తేడా అల్లా యాస మాత్రమే. మొదట్లో ఒకటి రెండు రోజులు ఇద్దరికీ ఒకరి మాట ఒకరికి అర్థం కావటానికి కొంత కష్టపడాల్సి వచ్చింది. ఇప్పుడు వారికి ఏ సమస్యా లేదు.

అక్కడ ఎన్నో ఆటవిక తెగలు ఉన్నాయి. వాటిలో తాంగ్‌షంగ్ ఒకటి. డోల్మా ఆ తెగలో ఒక అమ్మాయి. ఇంటి పనులు, వంట పనులు అంటే నచ్చవు. అడవిలో వేట అంటే మొగాళ్ల కంటే ముందు నడుస్తుంది. ఆమె తండ్రి వైద్యం చేస్తాడు. అతనితో అడవిలో తిరిగి, చుట్టు పక్కల అడవుల్లో ఏ మొక్క ఎందుకు పనిచేస్తుందో తెలుసుకుంది. ఎలాంటి కొండనయినా ఉత్త చేతులతో ఎక్కగలదు. ఒక వయసు వచ్చిన తరువాత కూడా ఆడపిల్ల అలా అడవుల్లో తిరగటం

కూడదని ఇంట్లో వాళ్ళు కట్టడి చేయటానికి ప్రయత్నించారు. దానితో పూర్తిగా రెబల్ అయింది డోల్మా. ఒకొకసారి రోజుల తరబడి అడవిలో ఉండి పోతుంది.

ఫ్లోరెన్స్ తండ్రి రాయల్ ఎయిర్‌ఫోర్స్ పైలెట్. అతని పేరు మింటో. భార్య మిగిలిన పిల్లలు ఇంగ్లండు లోని బ్రిస్టల్‌లో ఉంటారు. ఫ్లోరెన్స్‌కి సాహస క్రీడలు అంటే ఇష్టం. మగపిల్లలతో పోటీ పడి చేసిన సాహసాలు కిక్కు ఇవ్వటం మానివేశాయి. ఇంగ్లండులో సాహసాలకు వెతుక్కోవాలి. అదే ఇండియాలో ప్రతి అడుగు సాహసమే అని ఎవరో మిత్రులు చెప్పారు. పోయినసారి మింటో బ్రిస్టల్ వెళ్లినపుడు తను కూడా ఇండియా వస్తానని అడిగింది ఫ్లోరెన్స్. ససేమిరా కుదరదన్నాడతను. తన మొండితనం మొత్తం చూపించి తండ్రిని ఒప్పించింది ఆమె. వారిద్దరు కలకత్తా వచ్చారో లేదో మింటోకు కోహిమా వెళ్లమని ఆర్డర్లు వచ్చాయి. కూతురిని కోహిమాలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని అక్కడ ఉంచాడు తండ్రి. తండ్రి డ్యూటీ మీద ఒకొకసారి రోజుల తరబడి ఇంటి నుండి దూరంగా ఉంటాడు. అప్పుడు చుట్టుపక్కల ప్రదేశాలన్నీ తిరిగేది ఫ్లోరెన్స్. అలా తిరుగుతున్నపుడు పరిచయం అయింది డోల్మా.

ఇద్దరూ స్వతహాగా తిరుగుబాటుదారులు కావటంతో ఒకరికొకరు దగ్గరయ్యారు. ఇద్దరి అభిరుచులు ఒక్కటవ్వటం వారిని కలిసి తిరిగేలా చేసింది. అంతమాత్రాన ఇద్దరికీ అభిప్రాయ బేధాలు లేవని కాదు. పోట్లాడుకుంటే పిచ్చిపిచ్చిగా పోట్లాడుకుంటారు. మళ్లీ అంతలోనే కలిసిపోతారు.

ఇద్దరు కలిసి ట్రెక్కింగ్ పేరుతో ఎన్నో కొండలు ఎక్కారు. తండ్రి చూడకుండా తెచ్చిన సర్వీస్ రివాల్వర్ చేతిలో పట్టుకుని, పులి వేట పేరుతో ఫ్లోరెన్స్ రాత్రంతా చెట్టు మీద కూర్చుంటే, తను విల్లంబులు పట్టుకుని పక్కన నిలబడింది డోల్మా. డోల్మా పన్నిన ఉచ్చులో పడబోయే కుందేళ్ల కోసం కబుర్లు చెప్పుకుంటూ గంటలు గంటలు ఎదురు చూసేవారు.

ప్రస్తుతం తినటం ముగించిన ఫ్లోరెన్స్ ఒక సిగరెట్ పెదవుల మధ్య పెట్టుకుని మరొకటి డోల్మాకు ఇచ్చింది.

సిగరెట్ పెట్టె మీద ఉన్న 'ఉడ్‌బైన్' పేరును చూడటంతోనే డోల్మా మొహం వికసించింది. "ఎన్ని సిగరెట్లు తాగినా ఈ బ్రాండు సిగరెట్లలో ఉన్న మజా మరెందులోనూ రాదు..." అంటూ తను కూడా సిగరెట్ వెలిగించింది.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS